ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025

ఉష్ణోగ్రత : గరిష్ఠం 39.5 కనిష్ఠం 13.6

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:30
(సోమవారం సాయంత్రం)
సహర్: 5:06 (మంగళవారం ఉదయం)

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని..

యువకుడిపై యువతి మేనమామ దాడి



గొంతుపై గాయంతో నాని

షాద్‌నగర్ రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు ప్రేమికుడిపై యువతి మేనమామ కత్తితో దాడిచేసిన ఘటన శనివారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. షాబాద్‌కు చెందిన ఎమినోళ్ల నాని(23) షాద్‌నగర్ పట్టణానికి చెందిన నందిని(20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో 15రోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పెళ్లి చేసుకున్నారు. దాంతో నందిని కనిపించడం లేదంటూ ఆమె కుటుంబ సభ్యులు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న నాని, నందిని శనివారం రాత్రి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తాను మిస్సింగ్ కాలేదని, ప్రేమించిన వ్యక్తితో వివాహం చేసుకున్నానని తెలిపారు. తామిద్దరం మేజర్ అయినందున ఎలాంటి కేసు నమోదు చేయకపోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను కోరారు. అయితే, అనంతరం వారు పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు రాగానే నందిని మేనమామ రాజేశ్ నానితో దుర్భషలాడుతూ తన వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో నానిపై దాడి చేయడంతో గొంతు భాగంలో తీవ్ర గాయమైంది. పోలీసులు వెంటనే నానిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు. అనంతరం అతడిని ఇంటికి పంపించారు. దాడి చేసిన రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.



జానమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

కంపు.. కంపు!

షాద్‌నగర్ పరిధిలో మూడు చెరువులు కాలుష్య కాసారాలుగా మారాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమి కారణంగా అవి కంపు కొడుతున్నాయి. మురుగు, రసాయనాలు పరుగులు తీస్తుండటంతో చెరువుల్లోని నీటిని ఉపయోగించ లేని పరిస్థితి నెలకొంది. జల వనరులు కాలుష్యమయంగా మారడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. పంటలు పాడవుతున్నాయి. దీంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

చెరువుల్లో కాలుష్య దరువు

- కలుషితమయంగా షాద్‌నగర్ శివారు చెరువులు
- జలవనరుల్లోకి చేరుతున్న రసాయనాలు, మురుగు
- చనిపోతున్న చేపలు.. పాడవుతున్న పంటలు
- ఇబ్బందుల్లో రైతులు, మత్స్యకారులు

రంగారెడ్డి అర్బన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని జానమ్మ చెరువు ఒకప్పుడు ఏడాదంతా నీటితో కళకళలాడేది. ప్రస్తుతం చెరువులో గుర్రపు డెక్క నిండి నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. అలాగే షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డు వద్ద ఉన్న నివాసాల నుంచి వచ్చే మురుగంతా చెరువులో చేరుతోంది. నిర్వహణ లోపంతో నీరు కలుషితమై చేపలు కూడా చనిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. మత్స్యకారులు, రజక సంఘాల డిమాండ్ మేరకు ప్రభుత్వం గతేడాది నవంబర్ 18న చెరువు మరమ్మతు పనుల మిగతా 8వ పేజీలో...



సురసముద్రం చెరువులో మురుగు, చెత్త

పూడిక తీయించాలి



చెరువుల్లో పూడిక తీయించి కొత్తగా నీరు చేరి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. జానమ్మ చెరువులోకి మురుగు చేరి పూర్తిగా కలుషితమైంది. అందులోని నీరు కంపుకొడుతుంది. చెరువులో పేరుకు పోయిన గుర్రపు డెక్కను తొలగించి నీటిని శుభ్రపరిచేందుకు సున్నం చల్లాలి. చెరువుల్లోకి మురుగు రాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.

- మందడి సత్తయ్య, జానంపేట



చల్లా వంశీచంద్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా

చల్లా వంశీచంద్ రెడ్డి

కడ్తాల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి ఆదేశానుసారం ఆరుగురు సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురి కమిటీ సభ్యుల్లో వంశీచంద్ రెడ్డికి అవకాశం లభించింది. సమన్వయ కమిటీ సభ్యులుగా నియమితులైన వంశీని కాంగ్రెస్ నాయకులు సత్కరించి అబినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, బీచ్యనాయక్, జగన్, జవహర్‌లాల్ నాయక్, చేగూరి వెంకటేశ్, వస్పుల శ్రీశైలం, హీరాసింగ్, సత్యంయాదవ్, కృష్ణానాయక్, తులసీరామ్ నాయక్, వస్పుల శ్రీకాంత్, నరేందర్, ఫరీద్, రవీందర్ యాదవ్, అజీం, లక్‌పతి నాయక్, యాదయ్య, మహేశ్, రామకృష్ణ, బాల్‌రాజ్, శంకర్, వీరయ్య, బోసు రవి, కరీం, నంద్యనాయక్, కుమార్, ఆరీఫ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో రథాన్ని లాగుతున్న భక్తులు

కనుల పండువగా రథోత్సవం

ఆమనగల్లు, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని శోభాయమానంగా అలంకరించి దానిపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. అనంతరం రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు గూడ క్రిష్ణమాచార్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో దివ్యాంగులు

చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

శంకర్‌పల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపల్ పరిధిలోని జన్వాడలో ఆదివారం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కాసాల యాదయ్యతో కలిసి సంతకాలను సేకరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలలో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. ఇందుకోసం మార్చి1 నుంచి 30వ తేదీ వరకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. నేషనల్ డిసేబుల్డ్ స్టడీస్ ప్రకారంగా రాష్ట్ర జనాభాలో దివ్యాంగులు 12.02శాతం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే చట్ట స్థానిక సంస్థలలో వికలాంగులకు రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్, మున్సిపాలిటీ చట్టాలకు సవరణలు చేసి దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, బీర్ల చిన్నకుమార్, శెట్టి కుమార్, కాట్నె శేఖర్, మంగలి శ్రీనివాస్, జోగి గంగయ్య, లచ్చయ్య, సీతల్‌సింగ్, జంగయ్య తదితరులు ఉన్నారు.

అందని నిధులు.. అసంపూర్తిగా పనులు

నిలిచిన నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణం

రూ.10 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు ● చొరవ చూపని ప్రజాప్రతినిధులు, అధికారులు



అసంపూర్తిగా కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు

ఆమనగల్లు, మార్చి9(ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో భవనం వినియోగంలోకి రాక ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతుంది. పనులు పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఏళ్లకాలంగా నాయీబ్రాహ్మణులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా స్పందన లేదు. కులవృత్తిపై ఆధారపడి ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలకు చెందిన వందల మంది నాయీబ్రాహ్మణుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సభలు, సమావేశాలు జరుపుకోవడానికి, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి వీలుగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని నాయీబ్రాహ్మణులు ప్రభుత్వాన్ని కోరి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో పట్టణ సమీపంలోని గుర్రంగుట్ట కాలనీ వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పట్లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, అప్పటి సర్పంచ్ గోరటి యాదయ్యల చొరవతో 180 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. 2011లో అప్పటి మిగతా 8వ పేజీలో...

రూ.10 లక్షలు మంజూరు చేయాలి



ఆమనగల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవన అసంపూర్తి పనుల పూర్తికి రూ.10 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలి. ఈ విషయంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. అసంపూర్తి పనులతో కమ్యూనిటీ హాల్ వినియోగంలోకి రాక సమావేశాలు, శుభకార్యాలు జరుపుకోవడానికి ఇబ్బందిగా ఉంది.

కానుగుల గణేశ్, నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు- ఆమనగల్లు

ఎవరూ పట్టించుకోవడం లేదు



నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ అసంపూర్తి మిగిలిపోయిన పనుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పాలక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నా.. ఇక్కడి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దశాబ్ద కాలంగా అసంపూర్తి పనులతో కమ్యూనిటీ హాల్ వినియోగంలోకి రావడం లేదు. అవసరమైన నిధులు మంజూరు చేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

దేవరకొండ రమేశ్, నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు, ఆమనగల్లు

గంప ప్రవీణ్ అంత్యక్రియలు పూర్తి

- అమెరికాలో హత్యకు గురైన కేశంపేట యువకుడు
- మృతదేహం వద్ద నివాళులర్పించిన నేతలు
- శోకసంద్రంలో కుటుంబీకులు

7



పేదల కోసం పోరాడుదాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

7



సమన్యాయం ఇంకెన్నాళ్లకు?

» ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచిపోతున్నా సమాజంలో నేటికీ సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం రాలేదని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు, ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఫెన్షనర్ భవనంలో ఆదివారం 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్ళు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని పాలకులు సంక్రమంగా అమలు చేయకపోవడంతో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. చాలా దేశాల్లో ప్రైవేట్ పాఠశాలలు లేవని, ధనిక, పేద అన్న తేడా లేకుండా అందరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతూ సమాన హక్కులను పొందుతున్నారని వివరించారు. మన దేశంలో అందుకు భిన్నంగా ప్రైవేట్ విద్యను ప్రోత్సహించడంతో పేదల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో, ధనికుల పిల్లలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కులమతాలకతీతంగా అందరు స్వేచ్ఛాయుతంగా జీవిస్తూ, ఆర్థిక అసమానతలు తొలిగిపోయేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రమాదంలో పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు తలెత్తి మణిపూర్ లాంటి సంఘటనలు చొటుచేసుకోకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి, రాజ్యాంగాన్ని మార్చాలన్న కుట్ర చేస్తుందని వీర్లపల్లి ఆరోపించారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాల కోసం తెలంగాణను తెచ్చుకుని 11 ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ అవి నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకాలతో సాగునీరు వస్తేనే షాద్‌నగర్ ప్రాంతానికి మనుగడ ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మారుతున్న సాగునీటి సమస్య తీరడం లేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, సాగునీటి సమస్య పరిష్కారమయ్యే వరకు షాద్‌నగర్ టీజేఏసీ నాయకులు ఉద్యమించాలని రాఘవచారి కోరారు. ఈ సెమినార్‌లో షాద్‌నగర్ టీజేఏసీ నాయకులు జనార్ధన్, అర్జునప్ప, రవీంద్రనాథ్, ఎన్. నర్సింహులు, తిరుమలయ్య, బి. సత్యం, నర్సింహ్మగౌడ్, కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివశంకర్‌గౌడ్, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న హరగోపాల్

పూసింది పూత.. కాసేనా కాత



శంకర్‌పల్లి మండలం అంతప్పగూడ ఊరి చివరన ఉన్న మామిడి చెట్టుకు పూత విరగబూసింది. రోడ్డు పక్కన ఉండే ఈ చెట్టుకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకున్నా మస్తు పూత ఉండటం చూసి ఆ దారిలో వెళ్లేవారు ఆశ్చర్యపోతున్నారు. పూత ఇలా ఉంటే కాత ఎలా ఉంటదో అని చర్చించుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

అభివృద్ధిలో రాజీపడం


కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడే దిలేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో గ్రంథాలయ నిర్మాణం, ఎక్లాస్ఖాన్‌పేటలో ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు ఆదివారం భూమి పూజ చేశారు. భైర్కాన్‌పల్లిలో నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా రూప్లానాయక్, రాజు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వై.యాదయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, ఆనంద్‌కుమార్, జగదీశ్వరప్ప, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, రమేష్, శ్రీనివాస్, గిరిధర్, శ్రీనివాస్, పర్వతాలు, కొడూరు రాములు, శివయ్య, నరేందర్ రెడ్డి, గోపాల్, నారాయణ, బిక్షపతి, అనసూయమ్మ, లింగం, హరీశ్వర్, యాదగిరి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు పటిష్టంగా వేయాలి

షాద్‌నగర్ అర్బన్: సీసీ రోడ్డు పనులను పటిష్టంగా చేపట్టాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. షాద్‌నగర్ పట్టణ 17వ వార్డులో 10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. వేసే రోడ్లు పది కాలాలపాటు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, ప్రకాష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, సర్వర్‌పాషా, జమృద్, మోహన్, శ్రీశైలంగౌడ్, మురళీమోహన్, ఖదీర్, శ్రీను పాల్గొన్నారు.

శుద్ధ తాగునీటితోనే సంపూర్ణ ఆరోగ్యం

తలకొండపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శుద్ధమైన తాగునీటితోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, శతాబ్ది టౌన్షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. రామకృష్ణాపురంలో శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల సొంత డబ్బుతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యుడు అంజిరెడ్డిలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ఏళ్లుగా తోడ్పడుతున్న శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్థులు సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు పెద్దపీట వేస్తోందని ఆయన చెప్పారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇతర పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోందని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

త్రుణమే ఘనం!


- వ్యాధులకు విరుగుడు.. మిల్లెట్ ఫుడ్
- పాత తరం ఆహారానికి మళ్లుతున్న జనం
- పెరుగుతున్న త్రుణధాన్యాల వినియోగం
- డిమాండ్‌తో సాగుకు రైతుల ఆసక్తి


ఓ షాపులో అమ్ముతున్న చిరు ధాన్యాలు

చేవెళ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పదేళ్లయినా నిండని పిల్లలకు షుగర్. 30ఏళ్లు దాటని యువకులకు బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఈ కాలంలో సాధారణంగా మారాయి. కల్తీ ఆహారం, ఎక్కువ కొవ్వు పదార్థాలున్న వాటిని తినడం, చేసేవృత్తి, పని ఒత్తిళ్లు, సమయపాలన లేని తిండి, నిద్రలేమి తదితర కారణాలతో చాలా మంది ఇలాంటి వ్యాధులు, రుగ్మతల బారినపడుతున్నారు. ఎందరు డాక్టర్లను సంప్రదించినా, ఎన్ని రకాల మందులు వాడినా అనారోగ్య సమస్యలు మాత్రం తీరడం లేదు. చివరికి సంప్రదాయ ఆహారం మాని పాత తరం త్రుణధాన్య పంటల ఆహారం తీసుకుంటేనే వ్యాధులు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుగ్మగతలకు కొంతమేరైనా విరుగుడు ఉంటుందని అందరూ ఒప్పుకుంటున్నారు. అదే విధానాన్ని పాటిస్తున్నారు కూడా. చిరుధాన్య ఆహారంలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని వైద్యులు సైతం చెబుతున్నారు. ఈ కారణాల దృష్ట్యా ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెరిగి సాగు కూడా ఎక్కువైంది. వ్యాధి పీడితులైనా, సాధారణ వ్యక్తులైనా చాలా మంది తమ రోజువారీ ఆహారంలో మిల్లెట్స్(త్రుణ ధాన్యాల)వాడకాన్ని తప్పనిసరి చేసుకుంటున్నారు. తక్కువ కొవ్వు పదార్థాలు, ప్రోటీన్లు, చెక్కరలు ఉండే ఈ ఆహారమే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ఎక్కువ మంది ప్రజలు భావిస్తున్నారు.

దీర్ఘాయుష్మలు.. మన పూర్వీకులు

పూర్వీకులు తిన్న ఆహారంతో రోజంతా ఉత్సాహంగా ఉండేవారు. నేటి వారితో పోలిస్తే వారి జీవిత కాలం కనీసం 10 నుంచి 15ఏళ్లు ఎక్కువే ఉండేది. మారిన ఆహార అలవాట్లతో ఇప్పుడు తరచూ అరోగ్య సమస్యలు వస్తున్నాయి. జంక్‌ఫుడ్, కల్తీ ఆహారం, కొవ్వు పదార్థాలతో మనిషి ఆయుర్దాయం తగ్గుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. జొన్న, పజ్జొన్న, సజ్జ, కొర్రలు, రాగులు వంటి త్రుణధాన్య ఆహార వినియోగం పెరిగింది. వాటి ధరా ఎక్కువైంది. దీంతో రైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు.





పెరుగుతున్న త్రుణధాన్యాల సాగు

చేవెళ్ల ప్రాంతంలో చిరుధాన్య పంటలు సాగవుతున్నాయి. గత వానకాలంలో జొన్న 3,226 హెక్టార్లలో, యాసంగిలో 1,946ఎకరాల్లో వేశారు. వరి, మిర్చి, పత్తి తదితర ఆహార, వాణిజ్య పంటలతో పోలిస్తే చిరుధాన్యాల సాగుకు పెట్టుబడి, శ్రమ తక్కువ. చీడపీడల బెడదా తక్కువే. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండే ఉందని రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.


జొన్నచేను

మిల్లెట్స్ ఆహారం దివ్యౌషధం



చిరుధాన్య ఆహారంలోని పోషకాలు కొన్ని శారీరక రుగ్మతులను దూరం చేస్తాయి. పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోజూ డైట్‌లో చిరుధాన్య ఆహారం ఉంటే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు, అలాగే వ్యాధి లేని వారికి అవి రాకుండా కూడా దోహదం చేస్తాయి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి

పురాతన విగ్రహం లభ్యం


లభ్యమైన పురాతన విగ్రహాన్ని కడుగుతున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలం ఎన్కెపల్లిలో ఆదివారం సీసీ రోడ్డు పనులకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతుండగా పురాతన విగ్రహం బయల్పడింది. అంజనేయస్వామి ఆలయ సమీపంలో పురాతన విగ్రహం లభ్యం కావడంతో గ్రామస్తులు విగ్రహానికి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. పలువురు గ్రామ దేవత విగ్రహమని, కొందరు ఆంజనేయస్వామి విగ్రహమని అన్నారు.

కేంద్ర మంత్రి సంజయ్‌కి ఘన స్వాగతం


మంత్రి బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న సంజయ్‌ని షాద్‌నగర్ వద్ద జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో కలిసి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను, కార్యకర్తలను సంజయ్ అప్యాయంగా పలికరించారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, వంశీకృష్ణ, వెంకటేష్, ఎం.మురళి, ప్రశాంత్, నర్సింహ, శివ, సాయిగౌడ్, రఘుగౌడ్, జి.విజయ్, జి.రమేష్, గోపాల్, శ్రీనాథ్, రామకృష్ణ, రవినాయక్ ఉన్నారు.


టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభను
విజయవంతం చేయాలి


శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా రెండో మహాసభను విజయవంతం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న మంగళవారం శంకరపల్లి మండలం పొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో నిర్వహించే మహాసభకు మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మాజిద్, సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, కార్యదర్శి రాంనారాయణ, పలువురు జాతీయ నాయకులు హాజరవుతారన్నారు. జర్నలిస్టులంతా మహాసభకు తరలి రావాలని వారు కోరారు. జిల్లాలో 25సంవత్సరాలకుపైగా సేవలందిస్తున్న జర్నలిస్టులను ఈ మహాసభల్లో సన్మానిస్తామని తెలిపారు. అన్ని నియోజకవర్గాల జర్నలిస్టులు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

ఎన్ఎస్‌యూఐ సోషల్ మీడియా
జిల్లా కో-ఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డి

మంచాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్‌గా కుకుడాల నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆరుట్లలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాతిరి ఎల్లేష్, రాఘవ, నాగరాజు, శంకర్, అశోక్, రాయుడు, చీరాల జంగయ్య, మంకు ప్రవీణ్, గుడ్డిమల్ల చంద్రయ్య, మాసయ్యగౌడ్, కావలి బుగ్గ రాములు, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, రావుల బాష, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నరేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బైర్కాన్‌పల్లిలో బండలాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల విజేతకు మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్ రూ.75వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, నాయకులు మురళీధర్‌రెడ్డి, యాదగిరి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, వెంటయ్య, ద్రోణాచారి, సాజిద్, జమాల్‌ఖాన్. భాస్కర్, రామకృష్ణ, వేణుగోపాలచారి పాల్గొన్నారు.



నారపల్లిలో కట్టపోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

ఘట్‌కేసర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లిలో కట్టపోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు దోహదపడతాయన్నారు. నిత్యం కొంత సమయాన్ని ఆలయల్లో గడపితే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు, వజ్రేష్ యాదవ్ సైతం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్, శ్రీనివాస్, శేఖర్, మహేశ్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్

ముగిసిన క్రికెట్ టోర్నీ

ఆదిభట్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పల్లె సుదర్శన్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆదిభట్ల పరిధిలో పల్లె గోపాల్‌గౌడ్ నిర్వహించిన ఆదిభట్ల ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)-8 క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో గెల్చిన మహాత్మ యూత్‌కు మొదటి బహుమతి రూ.46,000, రన్నర్స్ గుజరాత్ టైటన్స్‌కు రూ.28,000 అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములు సహజమనీ, గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు బాధపడకుండా రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోరె జంగయ్య, శ్రీహరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, నంరెడ్డి మహిపాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడు

తలకొండపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్‌లోని కల్కిదోనగుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి గరుడవాహన సేవ, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద రథోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఫౌండర్‌ట్రస్టీ పట్టాభిరామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి, నాయకులు శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, పెంటారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేశ్, పాండురెడ్డి పాల్గొన్నారు.



కల్తీ ఐస్‌క్రీమ్ ప్యాకెట్ల స్వాధీనం



కల్తీ ఐస్‌క్రీమ్ ప్యాకెట్లు



పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రం నుంచి రవాణా చేస్తున్న కల్తీ ఐస్‌క్రీమ్‌లకు వినియోగించే ప్యాకెట్లను వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. నకిలీ కంపెనీల కోసం రవాణా చేస్తున్న ఫ్రూటీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, నిందితులను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీదర్‌కు చెందిన ఓ వ్యాపారి కంపెనీ పేరు లేని ఐస్‌క్రీమ్ ప్యాకెట్లను తయారు చేసి వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. ఓ వాహనం(కేఏ32 డి5660)లో ప్యాకెట్లను రవాణా చేస్తుండగా తాండూరులో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. తయారీ తేదీ, గడువు తేదీ లేని 67 ఐస్‌క్రీమ్ ప్యాకెట్ల బండళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియా.. మీ దయ!

- వెలగని వీధి లైట్లు, వృథాగా పోతున్న తాగు నీరు
- పట్టింపులేని ఇంజనీరింగ్ విభాగ అధికారులు
- ఇబ్బందుల్లో పట్టణ వాసులు

తాండూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగ అధికారుల పట్టింపు లేని ధోరణితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాల సక్రమంగా వెలగడం లేదు. నీటి సరఫరా విధానంలో అధికారుల చర్యలు తూతూ మంత్రంగా ఉంటున్నాయి. కమిషనర్ పర్యవేక్షణ కొరవడి, సిబ్బంది పనితీరు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షలు పోసి కొన్న లైట్లు నాసిరకంగా ఉండడంతో నెలరోజులకే పనిచేయడం లేదు. మరమ్మతుల పేరిట మరింత భారీ ఖర్చు చేస్తున్నారు. అయినా లైట్లు వెలుగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఐబీ రోడ్డులో స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని జనవరి 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం లైట్లు మళ్లీ వెలగడం లేదు. కాలనీ వాసులు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు కూడళ్లలోనూ వీధి దీపాలు లేవు. బల్దియా ఇంజనీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అలాగే తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కాలనీలకు మంచి నీటి సరఫరాకు ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ట్యాంక్ నిర్వహణను గాలికొదిలేశారు. ఈ ట్యాంక్ నిండి నీరంతా వృథాగా పోతోంది. గత శుక్రవారం రాత్రి ట్యాంక్ నిండి శనివారం ఉదయం వరకూ మైదానం అంతా నీరు పారింది. శనివారం రాత్రి వాల్వ్ బంద్‌చేయక నీరంతా వృథాగా పోయింది. ఈ ఫొటోలు స్థానికంగా సోషల్ మీడియాలో వైరలయ్యాయి. గ్రౌండంతా బురదమయమైంది. వాకింగ్ చేసే వారు, ఆడుకోవడానికి వచ్చే క్రీడాకారులు అధికారుల తీరుపై మండిపడ్డారు. నీటి సంరక్షణలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. ఇకనైనా అధికారులు నీటి వృథాను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఇంతలా నీరు వృథా కావడంతో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది.



తాండూరు ఐబీ రోడ్డులో వెలగని వీధి లైట్లు

సమస్యలను తెలుసుకోని కమిషనర్

గతంలో మున్సిపల్ కమిషనర్లు ఉదయం వార్డుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే వారు. ప్రస్తుత కమిషనర్ విక్రంసింహారెడ్డి మార్నింగ్ వాక్ చేయడం లేదు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు సుభాన్‌రెడ్డి ఎమ్మెల్యేకు ఫిర్యాదు సైతం చేశారు. ఉదయం వార్డుల్లో తిరిగితే ఎక్కడ స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు, చెత్త ఎక్కడ పేరుకుంటోంది? ఎక్కడైనా నీరు వృథాగా పోతోందా? అనేవి తెలుస్తాయి. లేదంటే ఆఫీసు వేళల్లో అయినా పట్టణంలో తిరిగి సమస్యలు తెలుసుకోవాలి. కానీ కమిషనర్ అవేమీ చేయడంలేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే తాండూరు మున్సిపల్ అధికారుల పనితీరుపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు హెచ్చరించినా వారి పనితీరులో మార్పు కన్పించడం లేదు.



తాండూరు జూనియర్ కళాశాల మైదానంలో వృథాగా పోతున్న ట్యాంక్ నీరు



మైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

దక్షిణాదిపై బీజేపీ వివక్ష

- సీడబ్ల్యూసీ సెక్రెటరీ చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి, నిధుల పంపిణీపై వివక్ష చూపుతోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై ప్రధానమంత్రి మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కడ్తాలలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం వంశీచంద్ సందర్శించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌లతో కలిసి మైసమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో స్నేహలత, అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలందజేశారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకొని బీజేపీ రాజకీయ లబ్ధికి యత్నిస్తోందన్నారు. బీజేపీ నేతలు మత విద్వేషాలను రగుల్చుతూ దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిచ్యానాయక్, జగన్, జవహర్‌లాల్, చేగూరి వెంకటేశ్, శ్రీశైలం, హీరాసింగ్, సత్యంయాదవ్, కృష్ణానాయక్, తులసీరామ్, పి.శ్రీకాంత్, నరేందర్, ఫరీద్, రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దీపక్‌జాన్

అనాథల సేవ.. భగవంతుడి సేవే

యాచారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలను చేరదీసి చదివించడమంటే భగవంతుడిని సేవించడమేనని బాలాగ్రామ్ సంస్థ అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించడం అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. ఆదివారం తక్కళ్లపల్లితండా సమీప బాలాగ్రామ్ సంస్థ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దేవుడిని ఎన్ని విధాలుగా, రూపాల్లో కొలిచినా ఒక్కటేనన్నారు. సంస్థలోని బాలలను బాగా చదివించి వారికి కొత్త జీవితాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంస్థలకు ఇతోధికంగా సాయమందించాలని కోరారు. నిరుపేదల ఉద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బాలాగ్రామ్ సంస్థ ఫాదర్ థామస్ రాంబల్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంగోత్ వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయానికి నడుపుతున్న క్యాబ్ డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలని టీజీపీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ ఆదివారం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టులో నడుపుతున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చేవరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వెహికల్ కిరాయిలను న్యాయంగా పెంచాలన్నారు. కొంత కాలంగా ఎయిర్‌పోర్టు అధికారులు, పోలీసులు తమ సమస్యలను పరిష్కరించడంతో ఆరోపించారు. డ్రైవర్లకు న్యాయం చేయకుంటే ఎయిర్‌పోర్టుకు వచ్చే ఇతర వాహనాలనూ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

గుడికి వెళ్లొచ్చేసరికి ...

ఇల్లు గుల్ల!

- 16.5తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాల చోరీ

కీసర రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబీకులు దేవుడి మొక్కు తీర్చుకొని వచ్చే సరికి ఇల్లు గుల్ల అయ్యింది. ఈ ఘటన ఆదివారం కీసర మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కూరగాయల వ్యాపారం చేసుకునే కొప్పుల లింగమ్మ, తన ఇద్దరు కుమారులతో నాగారం మున్సిపాలిటీలో ఉంటోంది. కుమారుల్లో ఒకరు టిఫిన్ సెంటర్ నడపుకుంటుండగా మరొకరు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ మధ్యనే చిన్న కొడుకు పెళ్లయింది. పెళ్లి తర్వాత పడమటి సోమారంలోని లింగబసవేశ్వర ఆలయం వద్ద నిద్ర చేస్తామని శనివారం సాయంత్రం వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికొచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. బెడ్‌రూంలోని అల్మారాలో భద్ర పర్చిన 16.5తులాల బంగారు, 40తులాల వెండి ఆభరణాలు, రూ.25వేల నగదు దొంగలు ఎత్తుకపోయినట్టు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

జీప్‌ల సామర్థ్య పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయ జీఎంఆర్ ఎరీనాలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జీప్(వాహనం)ల సామర్థ్య పరీక్షలు ఆదివారం ముగిశాయి. నోవాటెల్ హోటల్ సమీపంలో జీప్ వాహనాల సామర్థ్యం పరీక్షించేందుకు గుంతలతో ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. వీటిపై జీప్‌ల విన్యాసాలు అకట్టుకున్నాయి. ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్లు గతుకుల రోడ్డులో ఈ జీప్‌లను నడిపారు.





ప్రవీణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి రమ

ప్రవీణ్ అంత్యక్రియలు పూర్తి

- అమెరికాలో హత్యకు గురైన కేశంపేట యువకుడు
- మృతదేహం వద్ద నివాళులర్పించిన నేతలు
- శోకసంద్రంలో కుటుంబీకులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అమెరికాలో దుండగుల చేతిలో హత్యకు గురైన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్ అంత్యక్రియలు అతడి స్వస్థలం కేశంపేటలో ఆదివారం పూర్తయ్యాయి. అమెరికా నుంచి ప్రవీణ్ మృతదేహం తెల్లవారుజామున 4గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. అక్కడ పోలీసుల ప్రక్రియలు పూర్తిచేసి 6గంటల ప్రాంతంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరిక మేరకు నిమ్స్ ఆస్పత్రి అధికారులు మృతదేహాన్ని తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. కేశంపేటకు ప్రవీణ్ మృతదేహం రాకతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రవీణ్ తల్లి రమ కొడుకు మృతదేహాన్ని చూసి గుండెలు బాదుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంప్రదాయంలో దహన సంస్కారాలు పూర్తిచేశారు. అంతకు ముందు ప్రవీణ్ మృతదేహం వద్ద షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు.



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రభుత్వ చేయూతతో పేదల్లో ఆత్మవిశ్వాసం

ఆమనగల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేదలను కష్టాలకడలి నుంచి బయటపడేసి వారు ఆత్మ విశ్వాసంతో బతకాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, గ్యారంటీ పథకాలతో పేదల కష్టాలు క్రమంగా తొలగుతాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ రూ.1.36 లక్షల విలువైన చెక్కులను ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. వివిధ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్లెల్లో ప్రగతి కాంతులు నింపేలా సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులు తమ దినచర్యల్లో భాగంగా పెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, జగన్, మానయ్య, నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్, బాబు, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడుదాం..

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

మంచాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం పోరాటాలు కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. జాపాలలో నిర్మించిన కామ్రేడ్ కర్రె కోటప్ప స్మారక భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూమి, భుక్తిల కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన నాటి రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ కృష్ణమూర్తి నేతృత్వంలో అడివయ్య, జంగయ్య, జంగారెడ్డి, శ్రీరాం వెంకటయ్యలతో కలిసి కోటప్ప పాల్గొన్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం జాపాలకు ఏకగ్రీవ సర్పంచ్‌గా 30ఏళ్లు సేవలందించారని చెప్పారు. అమరుల ఆశయసాధనకు కృషిచేస్తామన్నారు. నేటి పాలకులు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సలసమస్యలపై పోరాడుతున్నది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి సుమలత, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లట్టుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కె.పాపిరెడ్డి, వై.జగన్, బుగ్గరాములు, ఎస్.రాజు, ఆర్.స్వామి, లెనిన్, కె.జంగయ్య, భాస్కర్, వినోద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పి.యాదయ్య

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం ఈగల్ కుంగ్‌ఫూ కరాటే వ్యవస్థాపకుడు హజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అంజయ్యయాదవ్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి మార్షల్ ఆర్ట్స్‌తో మానవునికి సంబంధాలున్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు చదువుతో పాటు, కరాటేలో శిక్షణ పొందాలన్నారు. కరాటేతో స్వీయ రక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. మండల కేంద్రంలో మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ హాజీని ప్రత్యేకంగా అభినందించారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, బాతుక దేవేందర్‌యాదవ్, చింతకింది రాజేందర్‌గౌడ్, యాదయ్య, కడాల శ్రీశైలం, కర్రొళ్ల లక్ష్మయ్య, రవినాయక్, సిటీకేబుల్ వెంకటేష్, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యానికి చట్టం చేయాలి



సంతకాలు పత్రాన్ని చూపిస్తున్న యాదయ్య

కేశంపేట, మార్చి 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం కోసం చట్టం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కేశంపేట మండలాధ్యక్షుడు సూరమోని యాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో స్థానిక సంస్థలో ప్రాతినిధ్యం కోసం లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 1నుంచి 30వరకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ కొనసాగుతుందని తెలిపారు. నేషనల్ డిసేబుల్డ్ స్టడీస్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 43.02లక్షల మంది.. అంటే రాష్ట్ర జనాభాలో 12శాతం వికలాంగులు ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో వికలాంగులను నామినేట్ చేసేలా అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అక్కల రామచంద్రయ్య, డబ్బా శంకరయ్య, చాకలి మల్లయ్య, ఎండీ. పాషా, రఘు, ఆంజనేయులు, బాల్‌రాజ్, శివలింగం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే గ్రూప్ ఫలితాలు విడుదల చేయాలి

షాద్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించిన తర్వాతనే గ్రూప్ పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని ఎమ్మార్పీస్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ హోటల్లో ఎమ్మార్పీఎస్ ఫరూఖ్‌నగర్ మండల ఇన్‌చార్జి నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకముందే గ్రూప్ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తే మాదిగలతో పాటు ఉపకులాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టబోమంటూ హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయమన్నారు. దీనిపై త్వరలోనే ఉద్యమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో బొబ్బులి పాండు, ఎర్రోళ్ల సురేష్, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెదిరె పాపిరెడ్డికి ఘన నివాళి



పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల, మార్చి 9(ఆంధ్ర జ్యోతి): మావోయిస్టుల తూటాలకు బలైన దివంగత కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెదిరె పాపిరెడ్డి వర్ధంతిని ఆదివారం మంచాల మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఆరుట్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేతలు పాపిరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిరాడంబర జీవితం గడుపుతూ ఆదర్శంగా నిలిచిన పాపిరెడ్డి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, బాష, రమేష్, కావలి శ్రీనివాస్, వెదిరె సికిందర్‌రెడ్డి, సుంకరి పాండరీనాథ్, ఆనంగళ్ల యాదయ్య, బుగ్గరాములు, మారగోని మాసయ్య గౌడ్, మార సురేష్, చీమల జంగ య్యయాదవ్, రాఘవ, బుట్టి కృష్ణ, తాడూరి రంగారెడ్డి, మోహన్‌రెడ్డి, శిశుపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మంకు ప్రవీణ్, పాండాల శ్రీనివాస్, చీరాల జంగయ్య, నూకం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండ మల్లన్న లగ్గం

- హాజరైన ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



కడ్తాల్ : పూజల్లో భక్తులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం మామిడిపల్లిలో ఆదివారం వేదపండితుల సమక్షంలో బండ మల్లన్న కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో గత మూడు రోజులుగా హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథిలను సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు జిన్‌కుంట్ల నవీన్‌గౌడ్ ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు శివశంకర్ గౌడ్, జిల్లెల్ల రాంరెడ్డి, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, అనిల్‌రెడ్డి, మల్‌రెడ్డి పురుశోత్తంరెడ్డి, రవిందర్, గుట్టరాజు, నర్సింలు, కాట్న శ్రీశైలం, జెట్ట కుమార్, జెకె. నర్సింలు, రవిందర్, శివచారి, బేగ్ ఇతర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచెడ్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు నిర్వహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు అభిషేకం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మాజీ సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీను, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లు రావిచెడ్‌లో ఈనెల 20వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి ఆవిష్కరించారు. కాగా, కల్యాణోత్సవానికి రావాలని వారికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఆలయ వార్షికోత్సవాలు షురూ



నందిగామ మండలం మామిడిపల్లిలో నిర్వహించిన మల్లన్న కల్యాణంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, నాయకులు

కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ఎత్తైన గుట్టపై గల శ్రీ రామేశ్వర వీరాంజనేయస్వామి క్షేత్రంలో ఉన్న సీతారామచంద్రస్వామి, శివపార్వతులు, సరస్వతిదేవి ఆలయాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకురాలు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. తొలిరోజు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పారాయణాలు, లలిత పారాయణం, కుంకుమార్చన, త్రిశక్తి పూజలు, అమ్మవారికి అర్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు ప్రముఖ వేదపండితులు మేళ్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోర్పోలు లక్ష్మారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, శంకర్, రామకృష్ణ, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, అనిల్, తదితరులున్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

మాడ్గుల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారెడ్డిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శ్రీ సుదర్శన కృష్ణ ఫౌండేషన్ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్ గౌరవరం వెంకట్‌రెడ్డి తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కంపు.. కంపు!



బొబ్బిలి చెరువులో గుర్రపు డెక్క.. ఇతర చెట్లు

(5వ పేజీ తరువాయి)

కోసం రూ.2కోట్లు కేటాయించింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే చెరువుకు పాటు కాలువ, కట్ట పనులు మాత్రమే చేస్తున్నారు. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించడం తోపాటు పూడిక తీయాలని, అలాగే మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మురుగుమయంగా బొబ్బిలి చెరువు

షాద్‌నగర్- నాగులపల్లి మార్గంలో ఉన్న బొబ్బిలి చెరువు ద్వారా ఒకప్పుడు షాద్‌నగర్ పట్టణం మొత్తానికి తాగు నీరు అందేది. ప్రస్తుతం ఈ చెరువు మురుగమయంగా మారింది. స్థానిక న్యూసిటీ కాలనీ నుంచి ఫరూఖ్‌నగర్‌లోని సీఎస్‌కే గృహ సముదాయం మీదుగా మురుగును నిర్మూలించేందుకు ఒక పెద్ద కాలువను నిర్మించారు. సీఎస్‌కే గృహ సముదాయం తర్వాత కాలువ నుంచి వచ్చే మురుగు బొబ్బిలి చెరువులో కలుస్తుంది. దీంతో చెరువులోని నీరు కంపుకొడుతోంది. వర్షాకాలంలో ఈ చెరువు నిండి అలుగు పారిన మురుగు నీరు లింగారెడ్డిగూడ పరిధిలోని గురుకుంట, పెద్దిం చెరువులలో కలుస్తుంది. బొబ్బిలి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు గత ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువుకు ఆనుకుని మెట్ల నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా రేలింగ్ వేసి వదిలేశారు. పనులు పూర్తి చేయకుండానే మంజూరైన నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

సురసముద్రంలోకి రసాయనాలు

పురపాలిక పరిధిలోని చటాన్‌పల్లి శివారులో ఉన్న సురసముద్రం చెరువులోకి ఓ వైపు మురుగు.. మరోవైపు రసాయనాలు చేరుతున్నాయి. 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న హోటళ్ల నుంచి వెలువడే మురుగంతా ఈ చెరువులోకే చేరుతుంది. అలాగే సమీపంలోని పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలు కూడా చెరువులోకి వదులుతుండటంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. రసాయనాలు విడుదలవుతున్న పరిశ్రమ ఎదుట మత్స్యకారులు ఇటీవల ఆందోళన కూడా చేపట్టారు.

వర్షాకాలంలో కష్టమే..

రాబోయే వర్షాకాలంలో చెరువుల దుస్థితి ఇలాగే ఉంటే ఇబ్బందులు తప్పవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వర్షపు నీరు చెరువులోకి చేరే దశలో సమస్యలు ఇలాగే ఉంటే వాటిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆయకట్టు రైతులు, మత్స్యకారులు తీవ్ర అవస్థలు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు, పాలకులు చెరువులను పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవరాశుల మనుగడకు ప్రమాదం



పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను చెరువుల్లోకి చేరకుండా నియంత్రించాలి. లేదంటే జీవరాశుల మనుగడకు ప్రమాదం తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా వెంచర్లలో నిర్మించిన గృహ సముదాయాల నుంచి చెరువులోకి మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలి. కొత్తగా వెలసిన కాలనీల మురుగు జానమ్మ చెరువులోకి వదులుతున్నారు. దీంతో ఆ చెరువంతా కలుషితమై పంట పొలాలు పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి.

- గంగిరెడ్డి, సామాజికవేత్త, షాద్‌నగర్

అందని నిధులు.. అసంపూర్తిగా పనులు

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ సహకారంతో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.3లక్షలు కేటాయించారు. దీంతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు భవన నిర్మాణం చేపట్టి నిధులు సరిపడా స్లాబ్ వరకు పూర్తి చేశారు. ఆ తర్వాత నిధులు అందక ఏళ్ల కాలం పాటు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో 2015లో అప్పటి జడ్పీటీసీ కండె హరిప్రసాద్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ. లక్ష కేటాయించారు. దీంతో ఒక గది నిర్మాణం పూర్తయ్యింది. అసంపూర్తి పనులకు సహకరించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు అభ్యర్థించగా రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో గోడలు, కొన్ని పనులు పూర్తి చేశారు. ఇంకా ఫినిషింగ్, బండలు, తలుపులు, కిటికీలు, విద్యుత్, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా పనులకు మరో రూ.10 లక్షలు అవసరమవుతుందని ఆ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. అదనపు నిధుల మంజూరుకు రెండేళ్ల కాలంగా అధికారులకు విన్నవిస్తున్నారు. అయినా స్పందన లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని అసంపూర్తి పనులు పూర్తి చేయించి కమ్యూనిటీ హాల్‌ను వినియోగంలోకి తేవాలని పట్టణ నాయిబ్రాహ్మణులు కోరుతున్నారు.

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను సన్మానిస్తున్న మశ్చందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు

కడ్తాల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1964-69 హెచ్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. మాడ్గుల మండలం అవురుపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు, అమెరికాలో ప్రముఖ వైద్యుడు, ముద్విన్ పాఠశాల పూర్వ విద్యార్థి ఇటికాల మశ్చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆనాటి విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ దేశాలు, ప్రాంతాలు, హోదాలలో స్థిరపడ్డ బాల్యమిత్రులంతా సమ్మేళనంలో కలుసుకొని ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముద్విన్‌కు చెందిన.. అమెరికాలో స్థిరపడ్డ విశ్రాంత ప్రొఫెసర్ శ్రీపాతి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు తమకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతికి బాటలు వేసిన ఆనాటి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధితోపాటు సమాజ సేవా కార్యక్రమాలలో తమ వంతు పాలు పంచుకోవాలని తీర్మానించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కి అనురుద్రారెడ్డి, పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ఇటికాల మశ్చందర్ రెడ్డి, శ్రీపాతి అరవింద్ రెడ్డి, జగత్ రెడ్డి, రఘునందన్, అనంతరెడ్డి, దశరథ్ రెడ్డి, బాలబ్రహ్మం, దశరథం, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ్మా, నర్సిరెడ్డి, భూపాల్ రెడ్డి, ఎలీషా, దామోదర్ రెడ్డి, పర్వత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాసు, హెచ్‌ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజూ ఇంటిపన్ను వసూలు



ఇన్ముల్‌నర్వలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి సురేందర్

కొత్తూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం చివరి మాసం ఉన్నందున సెలవు రోజు కూడా ఇంటి పన్ను తీసుకుంటామని ఇన్ముల్‌నర్వ గ్రామపంచాయతీ గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శి సురేందర్ తెలిపారు. మండల పరిధిలోని ఇన్ముల్ నర్వ గ్రామంలో సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటి పన్నులు వసూలు చేశారు. ఇంటి పన్నులు చెల్లించని యాజమానులు త్వరలో చెల్లించి గ్రామపంచాయతీకి సహకరించాలన్నారు. అలాగే వ్యాపార లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఎండలు రోజురోజుకూ పెరిగి పోతున్నందున మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

భగత్‌సింగ్ యువజన సంఘం గ్రామ కమిటీ

తలకొండపల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్ గ్రామంలో ఆదివారం భగత్ సింగ్ యువజన సంఘం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు జల్లెల్ల పెంటయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు శివగల్ల రమేశ్‌ల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివగల్ల మహేశ్, ప్రధాన కార్యదర్శిగా సిల్వేరు రవి, కోశాధికారిగా రవి, ఉపాధ్యక్షులుగా మహేశ్, సిద్ధు, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్, శివకుమార్, సలహాదారుడిగా రాములును ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని స్థానిక నాయకులు సత్కరించి అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన చుక్కాపూర్‌కు చెందిన కాలూరి నర్సింహ కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాండు రంగారెడ్డిలు రూ. 5వేలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి రూ. 3 వేలు, మాజీ సర్పంచ్ కిష్టమ్మ రూ.వెయ్యి ఆర్థికసాయం అందజేశారు.

ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోం



దీక్షలో జేఏసీ నాయకులు గట్టిప్పలపల్లి వాసులు

తలకొండపల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రిలే దీక్షలను ఆమరణ నిరాహార దీక్షగా మారుస్తామని అన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 128వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, ప్రజాసంఘాల నేతలు తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రుల భరోసా

తలకొండపల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రులు చేయూతనందించారు. అధైర్య పడవద్దు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెల్జాల ఉన్నత పాఠశాల 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన డి.వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కష్టాల్లో ఉన్న ఆకుటుంబ గురించి తెలుసుకున్న బాల్యమిత్రులు ఆదివారం పరామర్శించారు. తలా కొంత పోగుచేసి రూ.40వేలు మృతుడి భార్య, పిల్లలకు అందజేశారు. చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులంతా భరోసా ఇచ్చారు. అదేవిధంగా గతంలో మృతిచెందిన మరో స్నేహితుడు మల్లేశ్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 30వేలు, మరో స్నేహితురాలు వాజిదా బేగంకు రూ. 30 వేలు అర్థిక సాయాన్ని అందజేశారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి హత్య

- తల, మొండెం వేరు చేసిన హంతకులు!



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరహరి

కేశంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ శివారు చౌదరిగూడ గ్రామ సమీపంలోని ఎర్రబోతు శేఖర్‌రెడ్డి వ్యవసాయ భూమి సమీపంలో సర్వేనెంబర్ 527లో గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గ్రామస్తులు గుర్తించారు. ఈమేరకు కేశంపేట పోలీసులకు సమాచారం అందించగా.. కేశంపేట సీఐ నరహరి వెళ్లి పరిశీలించారు. మృతదేహం తల, మొండెం వేరుగా ఉండడంతో హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరిస్తామని సీఐ తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా కుళ్లిన స్థితిలో ఉందని సీఐ తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



శ్రీనివాస్

మాడ్గుల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈమేరకు సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చంద్రన్‌పల్లికి చెందిన పెరికిటి శ్రీనివాస్‌కు ఐదేళ్ల క్రితం పాత బ్రాహ్మణపల్లికి చెందిన మహేశ్వరితో వివాహమైంది. నాలుగేళ్లు కాపురం చేశారు. ఐదు నెలల క్రితం హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకోవడానికి వెళ్లివస్తానని చెప్పిన శ్రీనివాస్ ఇంటికి తిరిగి రాలేదు. ఈమేరకు అతడి భార్య మహేశ్వరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాడ్గుల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగుల గ్రామంలో ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అందుగల వాగునుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండ గా పట్టుకున్నారు. ఈమేరకు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వేణుగోపాల్ రావు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించవద్దని పలుసార్లు తెలిపినా పెడచెవిన పెడుతున్నారని, మరోసారి పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

పది మేకల అపహరణ

కేశంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల లాలయ్యకు చెందిన 10మేకలను శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. లాలయ్య తన ఇంటి వద్దనే మేకల కోసం పాక ఏర్పాటు చేశాడు. రోజు మాదిరిగానే ఇంటి ముందు ఉన్న పాకలో శనివారం మేకలను వదిలాడు. అర్ధరాత్రి మేకలు, కుక్కలు అరుస్తుండగా వచ్చి చూసేసరికి మందలో నుంచి 10 మేకలను దుండగులు అపహరించినట్లు గుర్తించాడు. తనకు న్యాయం చేయాలని రైతు వేడుకుంటున్నాడు. అపహరణకు గురైన మేకల విలువ రూ.లక్షా 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యకు కారణమైన ముగ్గురి అరెస్ట్

ఆమనగల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అవమానం, చిత్రహింసలు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. అందుకు కారణమైన ముగ్గురు కటకటాల పాలయ్యారు. ఆమనగల్లు మండలం పులిగొనిపల్లి తండాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. పులిగొనిపల్లి తండాకు చెందిన బాణావత్ బుజ్జి కూతురు ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. తన కూతురు ప్రేమ వివాహానికి పక్కింటి మహిళ బాణావత్ దేవి వారి కుటుంబసభ్యులు కారణమని బుజ్జి, జెన్ని, తార్యలు పగ పెంచుకున్నారు. దేవిని ముగ్గురూ కలిసి తరచూ అవమానపరుస్తూ చిత్రహింసలతో వేదనకు గురిచేసారు. దాంతో ఈనెల 7న బాణావత్ దేవి అవమానం భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న దేవిని చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 8న మృతిచెందింది. దేవి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె మరణానికి కారణమైన బుజ్జి, జెన్ని, తార్యలపై కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిభట్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న శిబిరంపై ఆదిభట్ల పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రాగన్నగూడలోని ఓ పెంట్‌హౌస్‌లో ఆదివారం రాత్రి పందెం కాస్తూ పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శిబిరంపై దాడిచేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, రూ.93,140 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలపారు.



పెళ్లికానుక అందజేస్తున్న జర్పుల దశరథ్ నాయక్

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

కడ్తాల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):పేదింటి ఆడబిడ్డ పెళ్లికి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చేయూతనందించారు. మండల కేంద్రానికి చెందిన కోశిక లక్ష్మమ్మజగన్ దంపతుల కూతురు రోజా వివాహం జరిగింది. పెళ్లికి దశరథ్ నాయక్ హాజరై జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 21 వేలు నగదుతో పాటు పట్టుచీర అందజేశారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5వేలు అందజేశారు. నాయకులు నర్సింహ, లాయక్‌అలీ, పాండు, మహేశ్, యాదయ్య, జంగయ్య శ్రీను, రాజు, వెంకటేశ్, శ్రీకాంత్, బీక్యనాయక్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కూలి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కాళ్లు, చేతులు కోల్పోయి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్యాగరి ఆంజనేయులుకు కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందజేశారు. కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామానికి చెందిన పంబళ్ల వెంకటయ్య, వారి స్నేహితుల సహకారంతో ఆదివారం ఆసుపత్రికి వెళ్లి చికిత్సకు గాను రూ.పది వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ బసిరెడ్డి పద్మా నరెందర్‌రెడ్డి దంపతులు పేదింటి ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన తుపాకులు మల్లయ్య కూతురు శ్రావణి పెళ్లి నిశ్చయం కాగా వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకొని రూ. 20 వేల విలువ గల పుస్తె మెట్టెలు వితరణ చేశారు. ఈ మేరకు ఆదివారం పెళ్లి కూతురు తండ్రికి అందజేశారు.

మిత్రుడి జ్ఞాపకార్థం రక్తదానం

కేశంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వేముల్‌నర్వలో ఆదివారం డప్పు శివకుమార్ జ్ఞాపకార్థం మిత్రులు, మహబూబ్‌నగర్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 22 మంది యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ రాజు బృందం తదితరులున్నారు.